క్లుప్తంగా

అంగన్‌వాడీ నిర్వహణపై డీడబ్ల్యూఓ ఆగ్రహం

గట్టు: మాచర్ల గ్రామంలోని అంగన్‌వాడీ సెంటర్ నిర్వహణపై డీడబ్ల్యూఓ సునంద ఆగ్రహం వ్యక్తం చేశారు. మాచర్ల ఉన్నత పాఠశాల ఆవరణలో ఉన్న అంగన్‌వాడీ సెంటర్‌ను డీడబ్ల్యూఓ మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని శుభ్రంగా పెట్టుకోవాలని టీచర్లకు ఆదేశించారు. అంతకు ముందు బల్గెర గ్రామంలో నిర్వహించిన సెక్టారు మీటింగ్‌లో డీడబ్ల్యూఓ మాట్లాడుతూ ప్రతి నెల 1,2 తేదీల్లోపు అంగన్‌వాడీ టీచర్లు 0 నుంచి 5 ఏళ్లలోపు చిన్నారుల ఎత్తు బరువును ఖచ్చితంగా నమోదు చేయాలన్నారు. శిశు మరణాల పూర్తిగా తగ్గించే విధంగా అంగన్‌వాడీ టీచర్లు చర్యలు తీసుకోవాలని కోరారు. అంగన్‌వాడీ రికార్డులను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బల్గెర సెక్టార్ సూపర్‌వైజర్ యామిని, వివిధ గ్రామాలకు చెందిన అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

నేడు ముచ్చోనిపల్లెకు మందకృష్ణ మాదిగ రాక

గట్టు: మండలంలోని ముచ్చోనిపల్లె గ్రామానికి పద్మశ్రీ అవార్డు గ్రహీత మందకృష్ణ మాదిగ రానున్నట్లు ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు బల్గెర ఏసన్న ఒక ప్రకటనలో తెలిపారు. ముచ్చోనిపల్లె గ్రామంలో నూతనంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ నూతన విగ్రహాన్ని మందకృష్ణ మాదిగ ఆవిష్కరించనున్నట్లు ఎమ్మార్పీఎస్ నాయకులు తెలిపారు. కార్యక్రమానికి జిల్లాలోని ఎమ్మార్పీఎస్, వీహెచ్‌పీఎస్, ఎంఎస్‌పీ, ఎంఎస్ఎఫ్ అనుబంధ సంఘాల నాయకులు, ఇతర సంఘాల నాయకులు హాజరు కావాలని బల్గెర ఏసన్న విజ్ఞప్తి చేశారు.

వైభవంగా ఉత్సవాలు

అయిజ: రెండు మండలాల మధ్యన కొండపై నెలకొన్ని తిమ్మప్ప స్వామి ఒక్కరోజు జాతర ఉత్సవాన్ని భక్తులు మంగళవారం ఉత్సాహంగా నిర్వహించారు. భక్తులు ముడుపులు కట్టి, మొక్కులు చెల్లించుకున్నారు. అయిజ, వడ్డేపల్లి మండలాల మధ్యన ఉన్న ఎత్తైన కొండపై శ్రీదేవి, భూదేవి సమేతంగా వెలసిన వేంకటేశ్వరస్వామి (తిమ్మప్ప) జాతర ప్రతిఏట భక్తులు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ యేడాది భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో ఆలయ పరిసరాలు కిక్కిరిసిపోయాయి.

ఆలయానికి రూ.లక్ష విరాళం

అలంపూర్: దక్షిణకాశీ అలంపూర్ క్షేత్రానికి భక్తుడు విరాళం అందజేసినట్లు ఈఓ పురేందర్ కుమార్ తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన గుమ్మి వేణుగోపాల్‌రెడ్డి, మధులత దంపతులు మంగళవారం జోగుళాంబ బాల బ్రహ్మేశ్వర స్వామి ఆలయాలను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయాలకు వారు రూ.లక్ష విరాళం చెక్కును ఈఓకు అందజేసినట్లు తెలిపారు. ఈఓ వారిని శేషవస్త్రాలతో సత్కరించారు.

వర్షం కోసం ప్రత్యేక పూజలు



మానవపాడు: మండలంలోని ఏ బుర్దిపాడు, గోకులపాడు గ్రామాలలో మంగళవారం వర్షం కురవాలని గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏ బుర్దిపాడు గ్రామంలో గంగమ్మకు, గోకులపాడు గ్రామంలో 12 గంటల భజన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో భక్తిశ్రద్ధలతో ఉపవాస దీక్షలతో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

గురుకుల కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

ఎర్రవల్లి: మండల కేంద్రంలోని సాంఘీక సంక్షేమ గురుకుల బాలుర పాఠశాల, కళాశాల (అయిజ) లో ఇంటర్‌లో మిగిలిన సీట్ల భర్తీ కోసం ఈ నెల 31న స్పాట్ కౌన్సెలింగ్‌ను నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రామాంజనేయులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో ఎంపీసీ, బైపీసీ గ్రూపులలో మాత్రమే సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. ఆసక్తి గల విద్యార్థులు పదో తరగతి మార్కుల మెమో, టీసీ, బోనఫైడ్, కులం, ఆదాయం ధ్రువపత్రాలు, మూడు పాస్ పోర్ట్ సైజ్ పోటోలు తమ వెంట తీసుకొని 31న ఉదయం గం.09-00 లోపు కౌన్సెలింగ్‌కు హాజరుకావాలన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నెంబర్ 7995010612 ను సంప్రదించాలని ఆయన పేర్కొన్నారు.

ఫేస్ రీడింగ్‌తో పింఛన్ల పంపిణీ

ఉండవెల్లి: మండలంలోని అన్ని గ్రామాల్లో వితంతు, వృద్ధులకు పింఛన్ల పంపిణీ ఫేస్ రీడింగ్ యాప్ ద్వారా సబ్ పోస్టాఫిస్‌లో ఏర్పాటు చేసి పింఛన్లను పంపిణీ చేసినట్లు పోస్టాఫీసర్ హిమామ్ వల్లి తెలిపారు. మండల కేంద్రంలో మొత్తం 250 మందికి ఫేస్ రీడింగ్ ద్వారా పింఛన్లు పంపిణీ చేశారు.

సరిహద్దును సరిచేయరా?

- సుంకేసుల డ్యాం కరకట్టపై భద్రతా చర్యలు శూన్యం
- ఏపీ ప్రభుత్వ తీరుతో విసిగిపోతున్న రెండు రాష్ట్రాల వాసులు
- 2009 నుంచి కనీస మరమ్మతు కరువు
- ప్రతి సీజన్‌లో నదీ తీర గ్రామాలకు తప్పని తిప్పలు
- ఇరువైపులా రక్షణ కంచెలు కరువు



రక్షణ కంచె లేనిచోట పర్యాటకుల సందడి



రక్షణ కంచె లేని డ్యాం ముందుబాగం

రాజోళి: మూడు రాష్ట్రాల ప్రజలకు అనుబంధాలు కలిపే వారధి. వందలాది గ్రామాలకు నిత్యం రాకపోకలు చేసుకునే రోడ్డు, వేలాది వాహనాలతో నిరంతరం రద్దీగా ఉండే రహదారి. కానీ ఏపీ ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి వల్ల ఆ రోడ్డు రోజురోజుకు అధ్వానంగా తయారవుతోంది. తెలంగాణ-ఏపీకి సరిహద్దులో ఉన్న సుంకేసుల డ్యాం రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటకను కూడా కలుపుతుంది. మహారాష్ట్రకు చెందిన వాహనాలు సైతం ఈ మార్గంలో వెళ్తుంటాయి. ఈ డ్యాంలో సింహభాగం ఏపీకే ప్రయోజనం ఉంది. కాని నష్టాలో మాత్రం జిల్లాకు వాటా ఉంది. ప్రయోజనం కలిగిస్తున్న బ్యారేజీపై కనీస పర్యవేక్షణ లేకపోవడంతో అది రోజురోజుకు అధ్వానంగా తయారవుతోంది.

30 గేట్లతో డ్యాం

సుంకేసుల డ్యాం 30 గేట్లతో నిర్మాణమైంది. 1.2 టీఎంసీ సామర్థ్యం ఉన్న డ్యాం ఎఫ్ఆర్ఎల్ 292 మీటర్లుగా ఉంది. డ్యాంకు ఏపీ వైపు కేసీ కెనాల్ ఉంది. తెలంగాణ వైపు దాదాపు కి.మీ. మేర కరకట్ట ఉంది. గతంలో ఈ కరకట్టపై రోడ్డు ఉండేది. 2009లో వరదల సమయంలో కరకట్ట కోతకు గురై రాజోళి, తుమ్మలపల్లె, తూర్పుగార్లపాడు తదితర గ్రామాలు ముంపునకు గురయ్యాయి. అప్పుడు దెబ్బతిన్న కరకట్టకు ఉమ్మడి రాష్ట్రంలో జరిగిన తాత్కాలిక మరమ్మతులే తప్ప ప్రత్యేకించి ఏపీ ప్రభుత్వం మరమ్మతు చేపట్టలేదు. కరకట్ట అక్కడక్కడ కోతకు గురి కావడంతో నదీ తీర గ్రామాల్లో మళ్లీ ఆందోళన మొదలవుతోంది. గతంలో కట్ట కోతకు గురి కావడంతో జోగుళాంబ గద్వాల జిల్లా యంత్రాంగం మరమ్మతు చేపట్టింది. ఈ ఏడాది కూడా ఎగువ నుంచి వరద నీరు లక్షల క్యూసెక్కులు వస్తోంది. సాధారణ సమయంలో వరద వచ్చినా ఇబ్బంది లేకపోయినప్పటికీ, ఏకధాటిగా వర్షాలు కురుస్తున్నప్పుడు, నదిలో వరద ఎక్కువగా ఉన్నప్పుడు ఆందోళన తప్పడం లేదు. కరకట్టపై ఇరువైపులా రక్షణ గోడ లేకపోవడంతో ఒక వైపు అదుపు తప్పితే కిందకు జారిపోవడం, మరో వైపు అదుపు తప్పితే నేరుగా నదిలోకే వెళ్తారు. అంత ప్రమాదకరంగా ఉంది. దానిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో జిల్లాతో పాటు ఏపీలోని కర్నూల్ జిల్లా ప్రజలు, వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పర్యాటకులకు రక్షణ కరువు..

డ్యాంలో నీరు నిండుగా ఉన్నప్పుడు ఇరు రాష్ట్రాలలోని ఆయా ప్రాంతాల పర్యాటకులు వస్తుంటారు. డ్యాం దిగువ వైపు, స్టోరేజీ వైపు కనీసం రక్షణ కంచె లేకపోవడంతో పర్యాటకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా ఏపీ ప్రభుత్వం, కర్నూల్ జిల్లాలోని నాయకులు స్పందించి డ్యాం పరిసర ప్రాంతాల్లో రక్షణ చర్యలు, కరకట్టపై మరమ్మతులు చేయాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి



సుంకేసుల డ్యాం కరకట్టపై ఏపీ ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. కరకట్ట మన జిల్లాలో ఉన్నందున ఏమి జరిగినా నష్టం జిల్లా వాసులకే ఎక్కువగా ఉంటుంది. మన జిల్లా యంత్రాంగమే మరమ్మతు చేసింది. ఇరు రాష్ట్రాల వాసులు రాకపోకలు చేస్తున్నప్పుడు దానిపై బాధ్యత తీసుకోవాల్సిన అవసరం వారికే ఉంది. ఇకనైనా ఏపీ ప్రభుత్వం నిర్లక్ష్యం వీడి పటిష్టమైన రోడ్డును భద్రతా చర్యలను చేపట్టాలి.

– కురువ పల్లయ్య, జోగుళాంబ గద్వాల

సినారె సేవలు చిరస్మరణీయం



సినారె చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

గద్వాలటౌన్: తెలుగుకవిగా, సాహిత్యవేత్తగా డా.సినారె చేసిన సేవలు చిరస్మరణీయమని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ షేక్ కలందర్‌బాషా కొనియాడారు. ఎంఏఎల్‌డీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో సినారె జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ షేక్ కలందర్ బాషా సినారె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సాహిత్యంలో విశ్వంభర కావ్యానికి గాను సినారెకు ప్రతిష్టాత్మకమైన జ్ఞానపీఠ పురస్కారం లభించిందన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు నాగభూషణం, సత్యన్న, శంకర్, వెంకటేశ్వర్లు, మల్లికార్జున్, తదితరులు పాల్గొన్నారు.

నాగదేవతలకు ప్రత్యేక పూజలు



బీచుపల్లిలో నాగదేవతను పూజిస్తున్న భక్తులు



గట్టులో సుంకులమ్మ దేవాలయం దగ్గర భక్తులు

ఇటిక్యాల: మండల కేంద్రంతో పాటుగా ఆయా గ్రామాల్లో నాగుల పంచమి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దదిన్నె వేంకటేశ్వరస్వామి ఆలయంలో అర్చకులు ప్రత్యేక నాగ పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు నరసింహయ్య ఆలయ కమిటి సభ్యులు పాల్గొన్నారు.

గట్టు: మండలంలోని వివిధ గ్రామాల్లో భక్తిశ్రద్ధలతో నాగుల పంచమి నిర్వహించారు. శ్రావణ మాసం పంచమి సందర్భంగా నాగదేవతల విగ్రహాలకు పూజలు చేశారు. అనంతరం పుట్టలో పాలు పోశారు. కొత్తగా పెళ్లి చేసుకున్న జంటలు పెళ్లినాటి దుస్తులు నాగదేవతలకు పాలు పోశారు. గట్టులోని సుంకులమ్మ దేవాలయం దగ్గర భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాగదేవతల విగ్రహాలకు పాలు పోశారు.

అయిజ: మండల కేంద్రంలో, వివిధ గ్రామాల్లో మంగళవారం భక్తులు నాగపంచమి పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ ఆలయాల వద్ద ప్రతిష్ఠించిన నాగ ప్రతిమలకు పాలుపోసి ప్రత్యేక పూజలు చేశారు.

ఉండవెల్లి: మండలంలోని అన్ని గ్రామాల్లో నాగుల పంచమి సందర్భంగా నాగుల విగ్రహాలకు పాలు పోసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల కేంద్రంలోని శివాలయంలో నవ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఎర్రవల్లి: మండలంలోని వివిధ గ్రామాలలోని ఆలయాల్లో భక్తులు నాగదేవత విగ్రహాలకు, పుట్టల్లో భక్తిశ్రద్ధలతో కొబ్బరి గిన్నెలతో పాలు పోశారు.

ప్రభుత్వ భూమిని కాపాడండి



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

అయిజ: భూ కబ్జాదారుల నుంచి ప్రభుత్వ భూమిని కాపాడాలని బీజేపీ నాయకులు కోరారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలోని మున్సిపల్ కమిషనర్ సీహెచ్ సైదులుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ పట్టణ అధ్యక్షుడు భగత్‌రెడ్డి మాట్లాడారు. అయిజ పట్టణంలోని 936 సర్వే నంబర్‌లో పోలీస్ స్టేషన్‌కు ఎదురుగా, బుడుగజంగాల కాలనీలో 3 ఎకరాల ప్రభుత్వ భూమి ఒక వ్యక్తి కబ్జా చేసినట్లు తెలిపారు. 40ఏళ్ల క్రితం ప్రభుత్వం వ్యవసాయం చేసుకోవడానికి భూమిని ఇచ్చినట్లు తెలిపారు. ఆ భూమిని సాగు చేయకపోవడంతో కొన్ని సంవత్సరాల క్రితం ఆ వ్యక్తి పేరుతో ఉన్న భూమిని రెవెన్యూ అధికారులు రద్దుచేశారన్నారు. కబ్జాదారుడు కోర్టుకు వెళ్లి తనకు ప్రభుత్వ ఇచ్చిన భూమిని అన్యాయంగా లాక్కున్నారని, తిరిగి ఇప్పించాలని కోర్టును ఆశ్రయించినట్లు తెలిపారు. దీంతో ఈ సమస్యను పరిశీలించాలని కోర్టు కలెక్టర్ కార్యాలయానికి లేఖ పంపిందన్నారు. దీంతో కబ్జాదారుడు భూమిలో బోర్డుపెట్టి తనకు కోర్టు ఇచ్చిందని, ఎవరైనా ఈ స్థలంలోకి వస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు జారీ చేసినట్లు తెలిపారు. కబ్జాదారుడు ఆ పొలాన్ని ప్లాట్లు చేసి విక్రయించే ఆలోచనలో ఉన్నాడని, అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. అధికారులు స్పందించకుంటే పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ప్రదీప్ కుమార్, నాగరాజు, రాజశేఖర్, రాజు పాల్గొన్నారు.

సర్వీస్ రోడ్డును పరిశీలించిన ఆర్‌అండ్‌బీ ఏఈ



ఉండవెల్లి: మండలంలోని బైరాపురం గ్రామంలో బ్రిడ్జి నిర్మాణం పూర్తైనా సర్వీస్ రోడ్డు లేదని గ్రామంలోని కాలనీ వాసులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో మంగళవారం ఆర్‌అండ్‌బీ ఏఈ రాజేశ్వరి పరిశీలించారు. సర్వీస్ రోడ్డును ఏర్పాటుకు కొలతలు తీసుకుని వాటిని పరిశీలించారు. అధికారిని వివరణ కోరగా కలెక్టర్‌కు రిపోర్ట్ ఇస్తామని పేర్కొన్నారు.

పేదలకు ఎంతో ఉపయోగం సీఎంఆర్ఎఫ్



గద్వాల: పేదలకు మెరుగైన వైద్యం కోసం సీఎంఆర్ఎఫ్ నిధులు ఎంతో ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో ధరూరు, కేటీదొడ్డి మండలాల్లోని మల్లాపురం, నందిన్నె గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ మాజీ వెంకట్రామిరెడ్డి, సుభాన్, కురుమన్న, తిమ్మప్ప, తిక్కన్న, రంగస్వామి పాల్గొన్నారు.

కాలేజీ వసతి గృహాలు మంజూరు చేయాలి



గద్వాల: అయిజ మండల కేంద్రంలో కాలేజీ గృహాలు మంజూరు చేయాలని బీఆర్ఎస్‌వీ నాయకులు కుర్వ పల్లయ్య అన్నారు. మంగళవారం ఆయన జిల్లా కేంద్రంలోని ఎస్సీ సంక్షేమశాఖ జిల్లా అధికారి నుషితకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల కేంద్రానికి ఎస్సీ, బీసీ బాయ్స్ అండ్ గర్ల్స్ కాలేజీ వసతి గృహాలను మంజూరు చేయాలన్నారు. విద్యార్థుల భవిష్యత్తు దృష్టిలో ఉంచుకుని వసతిగృహాలు మంజూరు చేయాలన్నారు.

యువకుడికి గాయాలు

అయిజ: మండలంలోని వెంకటాపురం సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలైన సంఘటన చోటుచేసుకుంది. వడ్డేపల్లి మండలంలోని శాంతినగర్‌కు చెందిన నజీర్ కొన్ని రోజులుగా అయిజ మండలంలోని వెంకటాపురంలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం శాంతినగర్ నుంచి వెంకటాపురానికి బైక్‌పై వెళ్తున్న క్రమంలో వెంకటాపురం సమీపంలో కుక్క అడ్డురావడంతో అదుపుతప్పి కిందపడ్డాడు. దీంతో నజీర్‌కు గాయాలయ్యాయి. చికిత్సకోసం కర్నూలు ఆస్పత్రికి తరలించారు.

సెల్ఫీ మోజులో ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దు



రాజోళి: తుంగభద్ర నది ఉధృతంగా ప్రవహిస్తోందని, యువతీ యువకులు సెల్ఫీ మోజులో, రీల్స్ చేయాలనే కుతూహలంతో ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని ఎస్ఐ గోకారి తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నదిలో వరద ఎక్కువగా ఉండటం వల్ల నదీ తీర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, మత్స్యకారులు చేపల వేట కు వెళ్లొద్దని తెలిపారు. సుంకేసుల డ్యాం దగ్గరకు వచ్చే పర్యాటకులు సైతం అప్రమత్తంగా ఉండాలని, తమ పిల్లలను దూరంగా ఉంచాలన్నారు. డ్యాం పరిసరాల్లో ఆదమరిచి సెల్ ఫోన్లల్లో మునగడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశముంటుందని తెలిపారు. గ్రామాల్లో అత్యవసర సమయాల్లో పోలీసు, రెవెన్యూ అధికారులకు సమాచారం అందివ్వాలని తెలిపారు.

పట్టణంలో విస్తృతంగా పోలీసుల తనిఖీ



పాత బస్టాండ్ సమీపంలో తనిఖీలో పాల్గొన్న ఎస్పీ శ్రీనివాసరావు

గద్వాల క్రైం: పట్టణంలో మంగళవారం రాత్రి ఎస్పీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పోలీసులు విస్తృతంగా తనిఖీ చేశారు. వాహనదారుల వివరాలు సేకరించారు. సరైన పత్రాలు లేకుండా వాహనాలు నడుపుతున్న పలువురు అనుమానిత వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. జిల్లాకు చెందిన యువత, ప్రముఖులు, కూలీలు రాత్రి సమయాల్లో అసాంఘిక కార్యకలాపాల వైపు వెళ్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. పలు బృందాలుగా విడిపోయి సోదాలు చేపట్టినట్లు పేర్కొన్నారు. రెండు రాష్ట్రాలకు సరిహద్దు కావడంతో పలువురు రాత్రి సమయాల్లో చీకటి కార్యక్రమాలు, దొంగతనాలు జరిగే అవకాశం ఉందన్నారు. తనిఖీలో డీఎస్పీ మొగిలయ్య, సీఐ శ్రీను, పట్టణ ఎస్ఐ కల్యాణ్‌కుమార్, సిబ్బంది, తదితరులు ఉన్నారు.

'పది' విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ



స్టడీ మెటీరియల్ అందుకున్న విద్యార్థులు

గట్టు: పదో తరగతి విద్యార్థులకు మంగళవారం హెల్పింగ్ హ్యాండ్స్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా స్టడీ మెటీరియల్ అందజేశారు. చాగదోణ, బోయలగూడెం, ఇందువాసి, ఆరగిద్ద గ్రామాల్లోని పదో తరగతి విద్యార్థులకు వార్షిక పరీక్షలకు ఉపయోగపడే స్టడీ మెటీరియల్‌ను అందించారు. ఫౌండర్ రత్నసింహారెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు ఈ స్టడీ మెటీరియల్‌ను అందజేస్తున్నట్లు తెలిపారు. మాజీ ఎంపీపీ విజయ్ కుమార్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులకు అందించే స్టడీ మెటీరియల్ ఉపయోగపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హెడ్మాస్టర్ నర్సింహులు, శీధర్‌రెడ్డి,శ్రీకాంత్, నర్సింహులు, జయరాంగౌడు, బడేసాబ్ ఉన్నారు.

సూక్ష్మ పోషకాలతో అధిక దిగుబడి



రైతులతో మాట్లాడుతున్న సింగిల్ విండో ప్రెసిడెంట్ మధుసూదన్ రెడ్డి

అయిజ: పంటలకు సూక్ష్మపోషకాలు అందిస్తే అధిక దిగుబడి సాధించవచ్చని సింగిల్ విండో ప్రెసిడెంట్ మధుసూదన్ రెడ్డి అన్నారు. మంగళవారం సింగిల్ విండో పరిధిలోని ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్ గోదాంలో రైతులకు సూక్ష్మపోషక పదార్థాల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మధుసూదన్ రెడ్డి మాట్లాడారు. రైతులు వేసిన పంటల్లో అధిక దిగుబడి పొందాలంటే సేంద్రియ, రసాయన ఎరువులతో పాటు మెగ్నిషియం, బోరన్ తదితర సూక్ష్మ పోషక పదార్థాలు కూడా మొక్కలకు అందించాలన్నారు. కార్యక్రమంలో కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ జోనల్ మేనేజర్ సంతోష్‌రెడ్డి, జిల్లా సీఐఎల్ ఇన్‌చార్జి రవికుమార్, రైతులు పాల్గొన్నారు.

ధర్నాను విజయవంతం చేద్దాం

అలంపూర్: సమస్యల పరిష్కారం కోసం చేప డుతున్న ధర్నాను విజయవంతం చేద్దామని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రమేష్ అన్నారు. అలంపూర్ చౌరస్తాలో యూఎస్‌పీసీ పిలుపు మేరకు చేపడుతున్న ధర్నా పోస్టర్లను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయుల కోసం ఆగస్టు 1న జిల్లా కేంద్రంలో ధర్నా చేపడుతున్నట్లు తె లిపారు. ప్రభుత్వం మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా పెండింగ్ డీఏ బిల్లు మంజూరు చేయాలన్నారు. పీఆర్‌సీని తక్షణమే ప్రకటించాలన్నా రు. కార్యక్రమంలో కార్యక్రమంలో కుమార నాయుడు, నరేష్, మునిస్వామి, గరీబ్ బాష, వెంకటాచలం, సాయిబాబ, వెంకటేష్, ఎస్ మద్దిలేటి, కురుమూర్తి, విజయుడు, శ్రీను, రాముడు, వెంకటస్వామి, రాజ్ కుమార్, ఎల్లకృష్ణ, నాగరాజు ఉన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి



ఇటిక్యాల గురుకులలో విద్యార్థులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి

ఎర్రవల్లి: పాఠశాల పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని మండల వైద్యాధికారి డాక్టర్ రాధిక అన్నారు. మంగళవారం ఇటిక్యాల సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పాఠశాల, కళాశాలలోని 445 మంది విద్యార్థులకు గాను 111 మంది విద్యార్థులకు సిబ్బంది వైద్య పరీక్షలు నిర్వహించారు. అందులో దగ్గు, జలుబు, వాంతులు, విరోచనాలు, జ్వరం, తదితర, సమస్యలతో భాదపడుతున్న పలువురు విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేక వైద్య చికిత్సను అందించి మందులను పంపిణీ చేశారు. అనంతరం పాఠశాల పరిసరాలను, వంటగది, స్టోర్‌రూం లను ఆమె పరిశీలించి వంట సామాగ్రిని ప్రతిరోజు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. నిత్యం తాజా కూరగాయలు, ఆకుకూలతోనే వంట చేయాలని వంట సిబ్బందికి సూచించారు. విద్యార్థులు తమ వ్యక్తిగత పరిశుభ్రతను తప్పకుండా పాటించాలన్నారు. ఏదైనా ఆరోగ్య సమస్యలు తలెత్తితే విద్యార్థులు వెంటనే స్థానిక ఆరోగ్య కేంద్రానికి రావాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు, ఏఎన్ఎంలు, ఆశాలు, విద్యార్థులు ఉన్నారు.

ప్రమాదాలు జరిగితే అధికారులదే బాధ్యత



9వ వార్డులో మ్యాన్ హోల్ చూపుతున్న బీజేపీ నాయకులు

రాజోళి: మ్యాన్ హోల్స్ తెరిచి ఉండటం వల్ల చిన్న పిల్లలు, వృద్ధులు అందులో పడితే మున్సిపాలిటీ అధికారులదే బాధ్యత అని బీజేపీ పట్టణ అధ్యక్షుడు రామకృష్ణ అన్నారు. మంగళవారం మున్సిపాలిటీలోని 9వ వార్డులో నెలకొన్న సమస్యలపై పరిశీలించారు. మున్సిపాలిటీ మురుగు కంపు కొడుతోందని, దోమలు, పందులు విచ్చలవిడిగా సంచారం చేస్తున్నాయని, వాటిపై అధికారులకు వినతి పత్రాలు ఇచ్చినా పట్టించుకోవడం లేదన్నారు. డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా లేక, మురుగు రోడ్లపైకి ఎక్కి పారుతోందన్నారు. మ్యాన్ హోల్స్ ఉన్నచోట వాటిని మూయకుండా వదిలేసి పోతున్నారన్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు మధుసూదన్‌గౌడ్, వెంకటేశ్వర్లు, మోహన్ యాదవ్, శేఖర్ ఆచారి పాల్గొన్నారు.

ఓటరు జాబితాపై ఎంపీడీఓకు వినతి



ఎంపీడీఓకు వినతిపత్రం అందచేస్తున్న కొత్త రాజోళి వాసులు

రాజోళి: మండలంలో నూతనంగా విధులు చేపట్టిన ఎంపీడీఓ భాస్కర్‌ను జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు నిషాక్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం బీజేపీ నాయకులు సంజీవరెడ్డి, కొత్త రాజోళి వాసులతో కలిసి ఆయనకు ఓటరు జాబితాపై వినతిపత్రం అందించారు. 2009 వరదల తర్వాత నిర్వాసితులకు ప్రభుత్వం కొత్త రాజోళిలో ఇళ్లు నిర్మించిందని, దాని కోసం వార్డుల వారీగా స్థలాలు, ఇళ్లు నిర్మించారని చాలా మంది అక్కడే ఉంటున్నారని, మరి కొందరు పాత గ్రామంలోనే ఉంటున్నారని తెలిపారు. ప్రభుత్వం నిర్మించిన ఇళ్ల ఆధారంగా ఓటరు జాబితా తయారు చేయాలన్నారు. ప్రధానంగా 1,2,3,4,5 వార్డులకు సంబంధించి 80 శాతం ప్రజలు కొత్త రాజోళిలోనే ఉంటున్నారని, దాన్ని దృష్టిలో పెట్టుకుని జాబితాను రూపొందించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీఓ ఖాజా మొయినుద్దీన్, పంచాయతీ సెక్రటరీ కృష్ణయ్య, శశికుమార్, రంగన్న, రాముడు, కొత్త రాజోళి వాసులు పాల్గొన్నారు.